AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in



## రూ.799కే 'జియోభారత్' సేఫ్టీ ఫోన్లు..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న టెలికాం సంస్థల్లో ఒకటైన రిలయన్స్ జియో.. మరోసారి వినూత్న ఆవిష్కరణతో టెక్నాలజీ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025 వేదికగా, భద్రతపై ఎక్కువగా దృష్టి పెట్టిన 'జియోభారత్' సేఫ్టీఫస్ట్ ఫోన్లను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ప్రత్యేకించి పిల్లలు, మహిళలు, వృద్ధుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని రూపొందించింది. కాగా.. వీటి ధర రూ.799 నుంచి ప్రారంభమవుతుంది.

## ఇండియా పోస్ట్ నుంచి జాబ్ నోటిఫికేషన్

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** నిరుద్యోగులకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ శుభవార్త అందించింది. గ్రామీణ డాక్ సేవక్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భరీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 348 గ్రామీణ డాక్ సేవక్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది డిగ్రీ పూర్తి చేసిన 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులు కాగా.. ఆన్‌లైన్ ద్వారా అక్టోబర్ 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https://www.ippbonline.com/ లో సంప్రదించగలరు.

## లొంగిపోయిన మావో నేతలు




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిశారు. వీరు మావోయిస్టు పార్టీలో రాష్ట్ర నాయకులుగా పనిచేశారు.

## కళాశాలలో రూ. కోటి చోరీ




**అక్షరటుడే, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో గల బ్రిలియంట్ ఇంజనీరింగ్ కాలేజీలో భారీ చోరీ జరిగింది. దుండగులు కాలేజీలో దాచిన రూ. కోటి నగదును అపహరించారు. దీంతో కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. ఈ దేశంలోని మిండానావో ద్వీపంలో ప్రకృతి విలయం అతలాకుతలం చేసింది. శుక్రవారం ఉదయం 7.6 తీవ్రతతో భూకంపం వచ్చింది. భూకంప తీవ్రత దృష్ట్యా స్థానిక ప్రభుత్వం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. భారీ భూకంపం వల్ల మిండానావో ద్వీపం చాలా వరకు దెబ్బతింది.

## హైడ్రా దూకుడు.. ఆక్రమణల తొలగింపు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో హైడ్రా మరోసారి దూకుడు కొనసాగించింది. బంజారాహిల్స్‌లో అక్రమంగా కబ్జా చేసిన ఐదెకరాల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ ఆస్తులు, చెరువులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న హైడ్రా.. ప్రభుత్వ స్థలంలో కూల్చివేతలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో ఐదెకరాల్లో వెలిసిన ఆక్రమణలను తొలగించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం రంగంలోకి దిగిన హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సుమారు రూ.750 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను తొలగించింది.


## ముంబయి తరహాలో విశాఖ అభివృద్ధి: సీఎం



**అక్షరటుడే, అమరావతి:** ముంబయి తరహాలో విశాఖపట్నం అభివృద్ధి చెందుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల రాకతో ఐటీ హబ్‌గా మారుతోందని పేర్కొన్నారు. శుక్రవారం మంత్రివర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడులకు ఆమోదంతో పాటు సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేబినెట్ సమావేశంలో ఏ సంస్థకు ఆమోదం తెలుపుతున్నామో సంబంధిత శాఖ మంత్రి సమన్వయం చేసుకోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల బాటలో పయనించింది. వరుసగా రెండో వారం లాభాలతో ముగిసింది. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 97 పాయింట్ల నష్టంతో, నిఫ్టీ 14 పాయింట్ల స్వల్ప నష్టంతో ప్రారంభమయ్యాయి. అయితే అక్కడినుంచి కోలుకుని లాభాలబాట పట్టాయి. సెన్సెక్స్ ఇంట్రాడే కనిష్ట స్థాయినుంచి 582 పాయింట్లు, నిఫ్టీ 174 పాయింట్లు పెరిగాయి. చివరికి సెన్సెక్స్ 328 పాయింట్ల లాభంతో 82,500 వద్ద, నిఫ్టీ 103 పాయింట్ల లాభంతో 25,285 వద్ద ముగిశాయి.




వెనుకబడిన వర్గాలకు మళ్లీ నిరాశే మిగిలింది. రిజర్వేషన్ల అంశం తిరిగి మొదటికొచ్చింది. పార్టీలకు చిత్తశుద్ధి లోపించడంతో మళ్లీ అధికారం దూరమైంది. 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నెం. 9పై హైకోర్టు స్టే విధించింది. దీంతో స్థానిక ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. చివరకు రాజకీయ చదరంగంలో వెనుకబడిన వర్గాలు పావులుగా మారాయి. బీసీలను ఓటు బ్యాంకుగా మార్చుకున్న పార్టీలు మరోసారి అన్యాయం చేశాయి. పైగా హైకోర్టు రిజర్వేషన్ జీవోపై స్టే విధిస్తే న్యాయ పోరాటం చేయాల్సిన రాజకీయ పార్టీలు.. పరస్పర నిందాపరణలు చేసుకుంటున్నాయి. – అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# రిజర్వేషన్లపై రాజకీయం..

- బీసీలతో ఆడుకుంటున్న పాలిటికల్ పార్టీలు
- మరోసారి అన్యాయం చేసిన అధికార, ప్రతిపక్షాలు

బీసీలకు సామాజిక న్యాయం చేయడంలో ఏ పార్టీకి సరైన చిత్తశుద్ధి లేకుండా పోయింది. ఓట్ల కోసం తప్పితే బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్న వైఖరి కరువైంది. మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బీసీలకు అన్యాయం చేశాయి. చేస్తూనే ఉన్నాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పడం తప్పితే అమలు కోసం ప్రయత్నాలు కరువయ్యాయి. అధికార పార్టీతో పాటు విపక్షాలు సైతం అదే వైఖరి ఎంచుకోవడంతో వెనుకబడిన వర్గాలు వెనుకబడే ఉంటున్నాయి తప్పితే ముందడుగు వేయడం లేదు. పార్టీలకు చిత్తశుద్ధి లేకపోవడం, ఎవరికి వారే రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడంతో కోర్టులో బీసీల జీవోకు చుక్కెదురైంది.

### కాంగ్రెస్ వైఫల్యం..

రిజర్వేషన్లపై అధికార కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఆశ చూపి చివరకు నిరాశే మిగిల్చింది. రిజర్వేషన్లు పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేసినట్లు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ తొలి అడుగు వేయడమే తప్పుగా వేసింది. రిజర్వేషన్ల పెంపు అనేది రాజ్యాంగ సవరణతో కూడుకున్న అంశం. కేంద్ర సహకారం లేనిదే అది సాధ్యం కాదని తెలిసీ కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాట ఇచ్చింది. ఫలితంగా అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు, మంత్రిమండలి పర్మిషన్‌తో తీసుకొచ్చిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోద ముద్ర పడలేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రిజర్వేషన్లు పెంచుతూ జీవో తీసుకొచ్చింది. అది కోర్టుల్లో నిలబడదని తెలిసీ జీవో అనే ఆయుధాన్ని ప్రయోగించింది. చివరకు ఆ పార్టీ కోరుకున్నదే జరిగింది.

### బీఆర్ఎస్ ది మరోదారి..

ఇక, బీసీల విషయంలో బీఆర్ఎస్ తీరు మరోలా ఉంది. ఉద్యమ పార్టీకి మొదటి నుంచి బీసీల పట్ల చిత్తశుద్ధి లేకుండా పోయింది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తీసుకొచ్చిన చట్టం ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రతిబంధకంగా మారింది. మరోవైపు, అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతిచ్చిన బీఆర్ఎస్.. అది ఆమోదం పొందే వరకూ ప్రభుత్వంతో కలిసి నడవాల్సింది పోయి మధ్యలోనే వదిలేసింది. కేంద్రం వద్దకు వెళ్దామని, ఢిల్లీలో ధర్నా చేద్దామని కాంగ్రెస్ పిలుపునిస్తే ఖాతరు చేయలేదు. కులగణనలోనే ఆ పార్టీ ముఖ నేతలు పాల్గొనలేదు. ఇప్పుడేమో జీవోపై కోర్టు స్టే విధించడంతో ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

### ముస్లింల పేరిట బీజేపీ..

ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన విషయంలో అంటీ ముట్టనట్లుగానే వ్యవహరించింది. వాస్తవానికి బీజేపీ ఎప్పటి నుంచో రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరితోనే ఉంది. బిల్లుకు సంబంధించిన అసెంబ్లీలో మద్దతు ఇచ్చిన బీజేపీ.. మెలిక పెట్టింది. ముస్లింలను కలపకుండా బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఫిట్టింగ్ పెట్టింది. అందుకే బిల్లుతో పాటు ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలుపకుండా అడ్డుపుల్ల వేయించింది. ఇలా అన్ని పార్టీలు తమను మోసగించాయని బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మరియా కొరినాకు నోబెల్ శాంతి బహుమతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశలు ఆవిరయ్యాయి. నోబెల్ శాంతి బహుమతి 2025 వెనెజులాకు చెందిన పార్లమెంట్ సభ్యురాలు మరియా కొరినా మాచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గాను ఆమెకు ఈ పురస్కారం దక్కింది. ఈ యేడు మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ కాగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు.

## అంజన్‌కు కాంగ్రెస్ బుజ్జగింపులు..




**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ టికెట్ ఆశించి భంగపడిన పార్టీ నేతలను కాంగ్రెస్ నాయకత్వం బుజ్జగించే పనిలో పడింది. ఈ మేరకు మాజీ ఎంపీ, సీనియర్ నేత అంజన్‌కుమార్ యాదవ్‌తో పార్టీ కీలక నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితరులు అంజన్ కుమార్ యాదవ్ ఇంటికి వెళ్లారు. జూబ్లీ హిల్స్ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎంపీ అంజన్‌తో సమావేశమయ్యారు. పార్టీ టికెట్ కేటాయించకపోవడంపై అలక బూనిన ఆయనను పార్టీ నేతలు బుజ్జగించారు. రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు వస్తాయని సర్దిచెప్పారు.

## 'ఉప ఎన్నికలో బీజేపీదే విజయం..'


**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** బీసీలను కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. బీజేపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ నగరానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం రాంచందర్‌రావు విలేకరులతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందని రాంచందర్ రావు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తామని చెప్పారు.

## బాంబుదాడులతో దద్దరిల్లిన కాబూల్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరం బాంబులతో దద్దరిల్లింది. అయితే, దాడులు ఎవరు చేశారన్నది స్పష్టంగా తెలియక పోయినప్పటికీ పాకిస్తాన్ ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ చీఫ్ నూర్ వలీ మెహ్సూద్‌ను అంతమొందించడానికి పాక్ వైమానిక దళం కాబూల్‌పై దాడి చేసినట్లు సమాచారం. గురువారం అర్ధరాత్రి తర్వాత రెండు భారీ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఎంత మంది చనిపోయారన్నది ఇంకా వెల్లడి కాలేదు. ఆఫ్ఘన్ భూభాగం నుంచి సరిహద్దు ఉగ్రవాద దాడులను ఇకపై సహించబోమని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ ఆపరేషన్ జరగడం గమనార్హం.



## హెచ్1బీ వీసాల్లో మళ్లీ మార్పులు..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికాకు వెళ్లాలనుకుంటున్న వారికి ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి షాక్ ఇచ్చారు. వీసాల జారీ విషయంలో మరిన్ని కఠిన నిబంధనలు రూపొందించే పనిలో పడ్డారు. ఇప్పటికే వీసాల విషయంలో కీలక మార్పుల మార్పులు చేసిన ట్రంప్.. ఇటీవల హెచ్ 1బీ వీసా విషయంలో లక్ష డాలర్ల ఫీజు విధించారు. ఇప్పుడు ఈ వీసా విషయంలో మరికొన్ని మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. రిఫార్మింగ్ ద హెచ్ 1బీ నాన్‌ఇమిగ్రెంట్స్ వీసా క్లాసిఫికేషన్ ప్రోగ్రామ్ కింద ఈ కొత్త మార్పులు తీసుకురానున్నట్లు ఫెడరల్ రిజిస్టర్‌లో నమోదైనట్లు తెలుస్తోంది. అయితే వీసా పరిమితి మినహాయింపుల అర్హతను బట్టి కఠినం చేయనున్నారు. అలాగే వీసా ప్రోగ్రామ్ నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై కూడా దృష్టి పెట్టనున్నారు.

## సెకండ్ టెస్ట్ తొలిరోజు ఊపుమీద టీమిండియా



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** వెస్టిండీస్‌తో టీమిండియా సెకండ్ టెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి, ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తొలుత కేఎల్ రాహుల్, జైస్వాల్ బ్యాటింగ్‌కు వచ్చారు. రాహుల్ (38), సాయిసుదర్శన్ (87) పరుగులు చేసిన పేవిలియన్‌కు చేరారు. జైస్వాల్ 173 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అద్భుతమైన ఆటతీరు కనబర్చాడు. శుభ్‌మన్ గిల్ 20 పరుగులతో ఇద్దరు క్రీజ్‌లో నిలిచారు. 318/2తో మొదటిరోజు ఆట ముగిసింది.

## ఇండస్ట్రీలో మేల్ డామినేషన్: దీపికా



**బాలీవుడ్ నటి దీపికా పదుకొనే సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతుతూ.. సినీ ఇండస్ట్రీలో వివక్ష కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. సినిమా పరిశ్రమలో మగవారి ఆధిపత్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. హీరోల విషయంలో ఒకలా, మిగతా వారి విషయంలో మరోలా వ్యవహరిస్తుండడాన్ని ఆమె ప్రశ్నించారు. పని గంటల విషయంలో తనను టార్గెట్ చేశారని పేర్కొన్నారు. 8 గంటల షిఫ్ట్ అనేది ఎన్నో ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో కొనసాగుతోందని చెప్పారు. చాలా మంది స్టార్స్ ఎన్నోఏళ్లుగా 8 గంటలు పని చేస్తున్నారు.. కొంతమంది సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే షూటింగ్స్ చేస్తారని వివరించారు. కానీ తననే ఎందుకు టార్గెట్‌గా చేసుకున్నారో అర్థం కావడం లేదన్నారు.**

-అక్షరటుడే, సినిమాడెస్క్